మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

- నర్సరీల్లో చలువ పందిళ్ల ఏర్పాటు
- ఉదయం, సాయంత్రం నీరు పోసి సస్యరక్షణ చర్యలు చేపడుతున్న సిబ్బంది
- జాజిరెడ్డిగూడెం మండలంలో 1.80లక్షల మొక్కల పెంపకం



కుంచమర్తి నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

అర్వపల్లి : 9వ విడత తెలంగాణకు హరితహారంనకు సంబంధించి నర్సరీల్లో సిబ్బంది మొక్కల రక్షణకు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ విడతలో జాజిరెడ్డిగూడెం మండలంలో 1.80లక్షల మొక్కలను పెంచుతున్నారు. అయితే నర్సరీల్లో ఈ విడత మొక్కల పెంపకంలో భాగంగా కవర్లలో విత్తనాలు నాటగా మొక్కలు ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి. వేసవి మూలంగా ఎండలు తీవ్రం కావడంతో మొక్కలు ఎండిపోకుండా గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో అన్ని నర్సరీలకు నీడ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఈ మొక్కల సంరక్షణకు వన సేవకుల ద్వారా ప్రతి రోజూ నర్సరీల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో నీటిని కొడుతున్నారు. నాటిన విత్తు మొలకెత్తడానికి, తర్వాత పెరుగుతున్న మొక్కను రక్షించడానికి వన సేవకులు సంరక్షణ పనులను చేపడుతున్నారు.

17 నర్సరీల ద్వారా 1.80లక్షల మొక్కల పెంపకం..

జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా 17 గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీకి ఒకటి చొప్పున 17 నర్సరీలను ఏర్పాటు చేశారు. ప్రతి నర్సరీకి వన సేవకుడిని నియమించారు. వీరు ప్రతి రోజు నర్సరీలలో మొక్కల రక్షణకు తగు చర్యలు తీసుకుంటున్నారు. కలుపు పెరగకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. అలాగే ఏపుగా పెరిగిన మొక్కలను పెద్ద కవర్లలోకి మారుస్తున్నారు. మొలకెత్తని గింజలను తొలగించి మళ్లీ నాటుతున్నారు. ఒక్కో నర్సరీలో 10 నుంచి 15వేల వరకు మొక్కలను పెంచుతున్నారు. ఈసారి నర్సరీలకు సుమారు రూ. 21లక్షల వరకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను ఖర్చు చేస్తున్నారు.

ప్రతి రోజూ సంరక్షణ పనులు



మా గ్రామ నర్సరీలో 10 వేల వరకు వివిధ రకాల మొక్కలను పెంచుతున్నాం. విత్తనాలు నాటగా మొక్కలు ఇప్పుడే పెరుగుతున్నాయి. వన సేవకుడి ద్వారా రోజుకు రెండు సార్లు నీళ్లు కొట్టడం, సంరక్షణ పనులు చేపట్టడం జరుగుతుంది.

– ఉగ్గం ఉపేంద్ర, సర్పంచ్, కుంచమర్తి

చలువ పందిళ్లు ఏర్పాటు చేశాం



మండలంలో ఈసారి 17 నర్సరీల్లో 1.80లక్షల మొక్కలను పెంచుతున్నాం. మొక్కలు వాడి పోకుండా అన్ని నర్సరీల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు కలుపు తీయిస్తూ నీటి తడులు అందిస్తున్నాం.

– ఉపేందర్, ఏపీఓ, జాజిరెడ్డిగూడెం మండలం

క్లుప్తంగా

మహిళల రక్షణకు షీటీమ్స్



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చివ్వెంల : మహిళలు, బాలికల రక్షణ కోసమే ప్రభుత్వం షీటీమ్స్ ఏర్పాటు చేసిందని ఎస్ఐ విష్ణుమూర్తి అన్నారు. శుక్రవారం దురాజ్‌పల్లి గ్రామ శివారులోని ప్రతిష్ట ఫార్మసీ కళాశాలలో షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. మానవ అక్రమ రవాణా, లింగ వివక్ష, 100 డయల్, సోషల్ మీడియా, టోల్ ఫ్రీ నంబర్ 1930 తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో షీటీమ్ ఎస్ఐ పాండు నాయక్, సిబ్బంది యల్లారెడ్డి, శివరాం, సాలయ్య, భూపాల్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న అధికారులు

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని నెమ్మికల్లు దండుమైసమ్మ ఆలయ హుండీని శుక్రవారం లెక్కించారు. 72 రోజులకు గాను భక్తులు కానుకలు సమర్పించగా 3 లక్షల 24 వేల 348 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి కుశలయ్య తెలిపారు కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి, ఎంపీటీసీ యడవెల్లి ముత్తయ్య, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూముల కౌలుకు వేలం

నూతనకల్ : మిర్యాల గ్రామానికి చెందిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ భూములకు దేవాదయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కౌలు వేలం పాట నిర్వహించారు. సర్పంచ్ కనకటి సునీత అధ్యక్షతన 102 ఎకరాలకు వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన అనంతుల రాజు రూ. 4లక్షల 10వేలకు వేలంను దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, దేవాలయ శాఖ అధికారి కుశలవ, దేవాలయ కమిటీ చైర్మన్ కనకటి వెంకన్న, వైస్ ఎంపీపీ జక్కి పరమేష్, ఉప సర్పంచ్ మన్నెం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ కమిటీ ఎన్నిక

దురాజ్‌పల్లి : భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కామళ్ల నవీన్, గంటా నాగయ్య ఎన్నికయ్యారు. గరిడేపల్లిలో శుక్రవారం జరిగిన మహాసభల్లో వారిని ఎన్నుకున్నారు.

సకాలంలో వేతనాలు అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

తుంగతుర్తి : పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు మరికంటి శ్యాంప్రసాద్ అన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వేతనాలు సకాలంలో రాకపోవడంతో దళిత సామాజిక వర్గానికి చెందిన కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జీపీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్వాయి సందీప్, మల్లేపాక లక్ష్మణ్, శ్రీకాంత్, నవీన్ పాల్గొన్నారు.

26న ధర్మభిక్షం వర్ధంతి



మాట్లాడుతున్న బెజవాడ వెంకటేశ్వర్లు

దురాజ్‌పల్లి : ఈ నెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం 12వ వర్ధంతిని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో చామల అశోక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవితకాలమంతా కార్మికుల, కర్షకుల, పేదల అభ్యున్నతి కోసం పనిచేసి ప్రతి ఒక్కరి మనసులో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి బొమ్మగాని ధర్మభిక్షం అన్నారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, బొమ్మగాని శ్రీనివాస్, నిమ్మల ప్రభాకర్, గోపగాని రవికుమార్, రేగటి లింగయ్య, దీకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక

సూర్యాపేట : జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్ ఫరీద్, తమీనా సుల్తానా దంపతుల కూతురు మహ్మద్ ఫరీహ అహ్మద్ ఇటీవల ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర జూనియర్ సివిల్ జడ్జి పరీక్ష ఫలితాల్లో ఎంపికైంది. దీంతో శుక్రవారం ఆమెను బంధు మిత్రులు, పట్టణవాసులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



రామలింగేశ్వర స్వామి ఆలయానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

తిరుమలగిరి : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. గుండెపురి గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో నూతన శివాలయ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, జెడ్పీటీసీ దూపటి అంజలి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొమ్మినేని స్రవంతిసతీష్‌కుమార్, సర్పంచ్ పాక రేణుక, ఎంపీటీసీ సభ్యులు జమ్మిలాల్ తహసీల్దార్ రమణారెడ్డి, ఎంపీడీఓ ఉమేష్‌చారి, పార్టీ మండల అధ్యక్షుడు రఘునందన్ రెడ్డి, లక్ష్మయ్య, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్



బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ వీరయ్య



మద్దిరాల : ముకుందాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు

తిరుమలగిరి : మండల పరిధిలోని వెలిశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర బాలికలకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆకుల వీరయ్య మాట్లాడారు. చిరు ధాన్యాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని, ప్రతిరోజు చిరు ధాన్యాలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎండీ.ఖైరూన్నీస, ప్రధానోపాధ్యాయుడు దస్తగిరి, పంచాయతీ కార్యదర్శి భీమ్‌జా, అంగన్‌వాడీ టీచర్లు సురక్షిత, వీరమ్మ, ఎల్లమ్మ, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

మద్దిరాల : అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ టీచర్ షాహెదా అన్నారు. శుక్రవారం ముకుందాపురంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఉదయమ్మ, సృజన తదితరులు పాల్గొన్నారు.

‘ఛలో ఢిల్లీ’ని జయప్రదం చేయాలి



భానుపురి : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



పెన్‌పహాడ్‌లో..

భానుపురి : ఎస్సీ వర్గీకరణ సాధనతో పాటు మహిళా రిజర్వేషన్ బిల్లు, నూతన పార్లమెంట్ భవనానికి బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30 నుంచి రెండురోజుల పాటు నిర్వహించే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తప్పెట్ల శ్రీరాములుమాదిగ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని రైతుబజారు అంబేద్కర్ విగ్రహం వద్ద టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన ఛలో ఢిల్లీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఈ నెల 30న దీక్ష, 31న ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు జానయ్య, జిల్లా అధ్యక్షుడు పుట్టల శ్రవణ్‌కుమార్, నాయకులు వల్దాసు శంకర్, బొడ్డు మల్సూర్, యడవెల్లి రాము, సూరారపు నాగయ్య, బొల్లె అశోక్, బొల్లె శ్రీధర్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ, మహిళా బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని టీఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కత్తి ఉపేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఛలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుడిపూరి ఉపేందర్, సీనియర్ నాయకులు కత్తి రవీందర్, ఒగ్గు వీరయ్య, నకిరేకంటి సైదులు, ఒగ్గు గోపి, ప్రభాకర్, జానీ, చింత జానయ్య, పవన్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సూర్యాపేట : మాట్లాడుతున్న పావనికృపాకర్

పెన్‌పహాడ్ : అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని మాచారం, దూపహాడ్, లింగాల, జల్మాలకుంట తండాల్లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వచ్చే నెలలో మండల స్థాయిలో నిర్వహించే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మామిడి అంజయ్య, పొదిల నాగార్జున, గుర్రం అమృతారెడ్డి, అనిరెడ్డి వెంకట్‌రెడ్డి, బొల్లక బొబ్బయ్య, బిట్టు నాగేశ్వర్‌రావు, అనంతుల శ్రీనివాస్‌గౌడ్, దంతాల వెంకన్న, రాధాకృష్ణ, జడ వీరయ్య, గుగ్గిళ్ల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట : సూర్యాపేట శాసనసభ్యుడిగా మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని మూడోసారి గెలిపించేందుకు ప్రతి కార్యకర్త పనిచేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బండారు రాజా, వార్డు కౌన్సిలర్ గండూరి పావనికృపాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక 45వ వార్డులో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గండూరి కృపాకర్, కొండపల్లి సాగర్ రెడ్డి, కక్కిరేణి నాగయ్య, నూకల వెంకటరెడ్డి, కొండపల్లి లక్ష్మారెడ్డి, గోపగాని గిరి, రంగినేని లక్ష్మణరావు, తెరటపల్లి సతీష్, బజ్జూరి శ్రీనివాస్, బెజగం ఫణి, మిట్టపల్లి రమేష్ పాల్గొన్నారు.

27న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

అర్వపల్లి : అర్వపల్లిలో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ మండల స్థాయి ఆత్మీయ సమేళనానికి పార్టీ నాయకులు తరలిరావాలని మండల అధ్యక్షుడు, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు గుండగాని సోమేష్‌గౌడ్ కోరారు. మండల స్థాయి ఆత్మీయ సమ్మేళనం విజయవంతానికై శుక్రవారం అర్వపల్లిలో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈ సమ్మేళనానికి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, వల్లపు గంగయ్య, బొడ్డు రామలింగయ్య, దేవస్థాన చైర్మన్ సీహెచ్. విద్యాసాగర్, సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు నిరుద్యోగ మహాధర్నా

తుంగతుర్తి : హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద శనివారం బీజేపీ ఆధ్వర్యంలో జరిగే నిరుద్యోగ మహాధర్నాను జయప్రదం చేయాలని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కత్తుల నరేష్ కోరారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగాలను భర్తీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మహాధర్నాకు నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఆయనతో పాటు బీజేవైఎం నాయకులు నాగరాజు, బొంకూరి మధు, వెంకన్న, సాయికృష్ణ, మహేష్ ఉన్నారు.

కంటి వెలుగు పేదలకు వరం

అర్వపల్లి : కంటి వెలుగు కార్యక్రమం పేదలకు వరమని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాణ్యతండాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. 18ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగులోతు మాణిక్యం, ఉపసర్పంచ్ రెడ్యానాయక్, కంటి వెలుగు వైద్యాధికారి డాక్టర్ చినపాక మణిరత్నం, సీహెచ్ఓ చరణ్, పంచాయతీ కార్యదర్శి కుంభం కావ్య, ఆప్తమాలజిస్ట్ ఎ. వేణు, హెల్త్ అసిస్టెంట్ కుంభం వీరయ్య, ఏఎన్ఎంలు సరస్వతి, విజయశాంతి, హెచ్ఎం ఎలుక కృష్ణారెడ్డి, సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. శుక్రవారం రాములతండా గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ వాంకుడోతు స్వప్న, నాగరాజు, ఎంపీటీసీ బాలాజీ, వైద్యాధికారి ప్రవంతి, విజయ, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, జెడ్పీటీసీ దూపటి అంజలి కోరారు. శుక్రవారం చింతలకుంట తండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంధత్వ నివారణ చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాటోతు రవినాయక్, వైద్యాధికారి మల్లెల వందన, సీహెచ్ఓ బిచ్చునాయక్, క్యాంపు డాక్టర్ సమతారాణి, పంచాయతీ కార్యదర్శి సురేష్, ఉప సర్పంచ్ భాషానాయక్, లలిత, వెంకటమ్మ, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషి



సర్పంచ్‌లు, కార్యదర్శులను సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీఓ

అర్వపల్లి : గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు జాతీయ పంచాయతీ పురస్కారాలు–2023 అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కతురోజు ఉమేష్, ఎంపీఓ ఉపేందర్‌రావు, సర్పంచ్‌లు ఉగ్గం ఉపేంద్ర, కుంభం ఉషారాణి, దబ్బేటి జ్యోతిరాణి, పెరుమాళ్ల పద్మ, సీనియర్ అసిస్టెంట్ సీహెచ్. నర్సింహరాజు, కార్యదర్శులు రవీందర్ రెడ్డి, మాగి నాగయ్య, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

గోదావరి జలాలు వైఎస్సార్ పుణ్యమే



పాదయాత్ర చేస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి

పెన్‌పహాడ్ : శ్రీరాంసాగర్ రెండో దశ ద్వారా రైతులకు గోదావరి జలాలు అందడం స్వర్గీయ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పుణ్యమేనని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నూర్జహాన్‌పేట, గూడెపుకుంట తండా, గాజులమల్కాపురం, మొర్సకుంట తండాలో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ మహా పాదయాత్ర నిర్వహించి మాట్లాడారు. సూర్యాపేట ప్రాంతంలోని భూములకు సాగు, తాగునీరు అందించాలనే ఆలోచనతో శ్రీరాంసాగర్ రెండో దశ ద్వారా కాల్వల నిర్మాణం చేపట్టి నీటిని అందించిన ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్, ఆయన అనుచర వర్గం సంక్షేమాన్ని గాలికి వదిలి ఆస్తులు కూడబెట్టుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బచ్చుపల్లి నాగేశ్వర్‌రావు, కుందూరు వెంకట్‌రెడ్డి, బెల్లంకొండ శ్రీరాములు, ముదిరెడ్డి ఎల్లారెడ్డి, యాట ఉపేందర్, వల్దాసు దేవేందర్, జగన్‌మోహన్‌రెడ్డి, అనంతరెడ్డి, నామా ప్రవీణ్, దూబ్బ, పంతులు, ఉస్సేన్, బండి శ్రీకాంత్ రెడ్డి, షేక్ బాలసైదా, సత్యనారాయణరెడ్డి, బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై అనర్హత వేటు తగదు

అర్వపల్లి : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై ఎంపీగా అనర్హత వేటు విధించడం తగదని డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. అనర్హత వేటును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కేసులకు భయపడే వ్యక్తి కాదు

మద్దిరాల : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కేసులకు భయపడే వ్యక్తి కాదని.. ఆయన ఒక శక్తి అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. అదానికి సంబంధించిన విషయాలను తప్పుదోవ పట్టించడానికే రాహుల్‌పై అనర్హత వేటు వేశారని అన్నారు. ఈ సమావేశంలో కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు బర్పటి ఉపేందర్, బొబ్బిలి వెంకన్న, పచ్చిపాల వెంకన్న, పాక అమృతమల్లు, తాళ్లపెల్లి సురేష్, కుతిబుద్దీన్, మద్దెల భిక్షపతి, కసనబోయిన లింగయ్య, మామునూరి ఉపేందర్, ఎల్లేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్‌గాంధీని ఎంపీ పదవికి అనర్హుడిగా ప్రకటించడం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కళ్లెం కృష్ణారెడ్డి, బొడ్డుపల్లి అంజయ్య, ఇమ్మారెడ్డి మహేష్‌రెడ్డి, మేడిపల్లి అశోక్, రాజాబహదూర్ రెడ్డి, ఉప్పుల శ్రీను, ముత్యం ప్రసాద్ పాల్గొన్నారు.

అనర్హత వేటు వేయడం హేయమైన చర్య

నాగారం : కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం హేయమైన చర్యని యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌కే.వలీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం ప్రశ్నించే వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. దర్యాప్తు సంస్థలను చేతుల్లోకి తీసుకొని ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తుందన్నారు. ఆయనతో పాటు హుస్సేన్, సలీం, అక్బర్‌పాష, కాలీయ, చాంద్‌పాష, బుడెన్, సురేష్ తదితరులు ఉన్నారు.

క్షయ వ్యాధిని నిర్మూలించాలి



తుంగతుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



నూతనకల్‌లో..

తుంగతుర్తి : ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మమత మాట్లాడారు. టీబీ లక్షణాలు ఉంటే ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకొని, మందులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ సముద్రాల సూరి, వైద్యసిబ్బంది ధనమ్మ, సురేష్, గాజుల సోమయ్య, యాదగిరి, చారి, వేణుగోపాల్, చొక్కయ్య, నవీన్, నాగరాజు, భారతి, కమల, జయమ్మ, స్వప్న, స్వాతి, రజిత, శైలజ, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి కీసర అశ్రితారెడ్డి కోరారు. శుక్రవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారు వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కరుణసాగర్, పీహెచ్ఎన్ తారమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా చింతలకుంట తండా గ్రామంలో వైద్య సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిని మల్లెల వందన మాట్లాడారు. టీబీ నిర్మూలన కోసం కృషి చేయాలని అన్నారు. టీబీ లక్షణాలు ఉంటే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బిచ్చునాయక్, సమతారాణి, లలిత, నర్సింహారెడ్డి, నాగరాజు, వెంకటమ్మ, రజిత పాల్గొన్నారు.

నాగారం : టీబీ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ నగేష్ అన్నారు. ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యసిబ్బందితో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు కోల్పోవడం, ఆకలి మందగించడం లాంటి టీబీ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే టీబీని నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ ధనమ్మ, వైద్యసిబ్బంది గుంటకండ్ల ప్రవీణ్‌రెడ్డి, కలమ్మ, నాగమ్మ, ఎల్లమ్మ, పార్వతి, ఆశలు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరి : చింతలకుంట తండాలో ..



నాగారంలో..

బీజేపీలో పలువురి చేరిక

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు శుక్రవారం బీజేపీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామచంద్రయ్య మాట్లాడారు. 2024లో రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వేల్పుల బంగారి, జిల్లా నాయకులు వై.దీన్‌దయాళ్, ఎం.యాదగిరి, కె.వెంకట్‌రెడ్డి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

భగత్‌సింగ్ ఆశయ సాధనకు ఉద్యమించాలి

ఆత్మకూర్ (ఎస్) : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఆశయాల సాధనకు యువత ఉద్యమించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సానబోయిన ఉపేందర్, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య అన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతి సందర్భంగా ఏపూరులో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో, తుమ్మలపెన్‌పహాడ్‌లో పీవైఎల్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వరికుప్పల మహేష్, అలుగుబెల్లి వెంకటరెడ్డి, అవిరె అప్పయ్య, వేణు, ఎల్లుట్ల నవీన్, సాయి, కల్లెంచర్ల శ్రీను, పోతురాజు ప్రతాప్, కంచర్ల నర్సక్క, లింగయ్య పాల్గొన్నారు.

యాత్రను జయప్రదం చేయాలి

పెన్‌పహాడ్ : బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో జరిగే జన చైతన్య యాత్రలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం చీదెళ్ల గ్రామంలో కొండమీది రాములు అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం రాష్ట్ర జన చైతన్య యాత్ర శనివారం కోదాడ పట్టణానికి చేరుకుంటుందని.. ఈ యాత్రలో సూర్యాపేటకు చెందిన వేలాది మంది సీపీఎం కార్యకర్తలు పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రణపంగ కృష్ణ, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చినపంగి నర్సయ్య, మడ్డి అంజిబాబు, గుర్రం గోపాల్‌రెడ్డి, అడివయ్య, గుంజా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

తిరుమలగిరి : ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల ఆర్థిక సాయం చేస్తానని ప్రకటించిన సీఎం కేసీఆర్ చిత్రపటానికి తాటిపాముల గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్ర శోభశ్రీనివాస్, ఎంపీటీసీ కె.ప్రవీణ్, ఉపసర్పంచ్ నాయిని మల్లయ్య, కె.అంజయ్య, సోమయ్య, సురేష్, దయాయాదవ్, కొమురయ్య, ఎల్లయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

మాదిగ రాజకీయ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా మురళి

తుంగతుర్తి : మాదిగ రాజకీయ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన ఇరుగు మురళిని శుక్రవారం ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బీఎన్ రమేష్ నియమించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నియామకపత్రాన్ని అందజేశారు.

గీత కార్మికుడికి పరామర్శ

నాగారం : మండల కేంద్రానికి చెందిన కల్లు గీత కార్మికుడు బాలగాని నారాయణగౌడ్ ఇటీవల ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై పడి గాయపడ్డాడు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకుడు, ప్రముఖ కంటివైద్య నిపుణుడు డాక్టర్ వడ్డేపల్లి రవి శుక్రవారం ఆయనను పరామర్శించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్‌పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మంగదుడ్ల దశరథ, నాగరాజు ఉన్నారు.

జీపీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

సూర్యాపేట రూరల్ : రాములతండా గ్రామంలో పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి ఆ గ్రామానికి చెందిన వాంకుడోత్ శ్రీను పద్మల కుమారుడు భగవాన్ స్థలాన్ని దానం చేయడంతో ఆ స్థలాన్ని శుక్రవారం ఎంపీపీ బీరవోలు రవీందర్ రెడ్డి, జెడ్పీటీసీ జీడీ భిక్షం పరిశీలించారు. దాత అందించిన స్థలంలో త్వరలోనే బిల్డింగ్ నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ వాంకుడోత్ స్వప్న, నాగరాజు, ఎంపీటీసీ వాంకుడోత్ బాలాజీ, గ్రామ కార్యదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.